క్లుప్తంగా

అంబులెన్స్‌లో ప్రసవం


శిశువును చూపిస్తున్న సిబ్బంది

గణపురం: పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను ఆస్పత్రికి తరలించే క్రమంలో 108లో ప్రసవించిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని అప్పయ్యపల్లి గ్రామానికి చెందిన దొంతుల కోకిలకు పురిటి నొప్పులు రాగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వెళ్లారు. కాగా పురిటి నొప్పులతో బాధపడుతుండడంతో 108 వాహనంలో ములుగుకి తరలించే క్రమంలో పురిటినొప్పులు అధికమై ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉండటంతో వారిని ములుగులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈఎంటీ శంకర్ రావు, పైలట్ శ్రీనివాస్, ఆశావర్కర్ పద్మను గ్రామస్తులు అభినందించారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

చిట్యాల: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ మండల కేంద్రంలో ఏబీవీపీ నాయకులు ధర్నా చేసి ప్రభుత్వ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నగర కార్యదర్శి అజయ్ మాట్లాడుతూ.. రూ.8300 కోట్లు స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉండగా రూ.600 కోట్లు విడుదల చేయడం సరికాదని అన్నారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని అన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతూ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ, జూనియర్ కళాశాల అధ్యక్షుడు సాయిచరణ్, నాగరాజు, శశివర్ధన్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


కార్మికుడిని పరామర్శిస్తున్న మధుసూదనాచారి

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని బొగ్గు గని ప్రమాదంలో గాయపడిన కార్మికుడు రాదండి మొండయ్యను హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. దీంతో బాధితుడిని రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మంగళవారం పరామర్శించారు. అత్యాధునిక వైద్య సహాయం అందించాలని ఆసుపత్రి యాజమాన్యం, సింగరేణి సీఎండీలను కోరారు.

వల్లెకుంటలో..


పరామర్శిస్తున్న మధు

మల్హర్: మండలంలోని వల్లెకుంట గ్రామంలో ఓదేలు ఇటీవల అనారోగ్యంతో మతి చెందారు. బాధిత కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంగళవారం పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మీరాజంను పరామర్శించి, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19న క్రీడా పోటీలు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 19న జోనల్ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జోనల్ చైర్మన్ ఎంఈఓ లింగాల కుమారస్వామి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో క్రీడల నిర్వహణపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుండెల్లి రాజయ్య మాట్లాడుతూ.. చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మూడు మండలాలను కలిపి మొగుళ్లపల్లి జోనల్ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు అండర్ 14, 17 బాల బాలికలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలలో 450 మంది క్రీడాకారులు ఈ జోనల్ స్థాయి క్రీడోత్సవాల్లో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు టి.వెంకన్న, చిట్యాల ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సూదం సాంబమూర్తి, టేకుమట్ల మండల ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ పృధ్వీరాజు సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు టి స్వరూపారాణి, బండి ప్రసాద్, సందీప్ రెడ్డి, గాజర్ల శ్రీనివాస్ ,మహేష్ , సుమలత, కార్తీక్ సంతోష్ ,అజయ్ , తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులేవి?


టేకుమట్లలో పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు


స్లాబ్ వరకు పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు

- నిర్మాణం పూర్తయినా మంజూరు కాని బిల్లులు
- ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు	398
ముగ్గు పోసినవి	308
బేస్మెంట్ పూర్తి అయినవి	112
దర్వాజా లెవెల్‌లో ఉన్నవి	14
స్లాబ్ వరకు పూర్తయినవి	12
గృహప్రవేశం చేసినవి	03

టేకుమట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసి అర్హులైన వారికి మంజూరు చేసింది. ముందుగా పైలెట్ ప్రాజెక్టులో భాగంగా టేకుమట్లలో అనంతరం మండలంలోని అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసి మంజూరు పత్రాలను అందించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో మొదటగా బేస్మెంట్ వరకు పూర్తి చేసిన తర్వాత అధికారులు ధ్రువీకరించి ఆన్లైన్ చేశాక రూ.లక్ష, స్లాబ్ లెవల్ గోడలు పూర్తి అయ్యాక రూ.లక్ష, స్లాబ్ పూర్తయిన తర్వాత రూ.2లక్షలు, పూర్తిస్థాయిలో ఇల్లు, బాత్రూంతో సహ నిర్మించి పెయింటింగ్ అయ్యాక చివరి బిల్లు రూ.లక్ష మొత్తం రూ .5లక్షలను ప్రభుత్వం చెల్లిస్తుంది.

బిల్లులు రాక లబ్ధిదారుల ఇబ్బంది

ఇందిరమ్మ ఇళ్లకు వచ్చే బిల్లులు ఆలస్యం కావడంతో ముందుగా పెట్టుబడి పెట్టి ఇళ్లను నిర్మించుకుంటున్న లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులను పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లను నిర్మించుకుంటుండగా విడతల వారీగా వచ్చే బిల్లులు తీవ్ర జాప్యం కావడంతో నిర్మాణాలు మందకోడిగా సాగుతున్నాయి. మండల కేంద్రంలో మూడు ఇందిరమ్మ ఇళ్లు పూర్తయి సుమారు నెల రోజులు దాటుతున్న ఇప్పటివరకు చివరి విడత బిల్లు రాలేదు. చివరి బిల్లు వస్తే అప్పులు చెల్లించుకుంటామని లబ్ధిదారులు ఆశతో ఎదురుచూస్తున్నారు. అంతేకాకుండా స్లాబులు పూర్తిచేసుకుని మూడో బిల్లు రూ.2 లక్షల కోసం 12 మంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు విడతల వారీగా చెల్లించే బిల్లులను వెంటనే చెల్లిస్తే ఇళ్ల నిర్మాణం సైతం ముందుకు సాగుతుంది. అధికారులు పాలకులు స్పందించాలని బిల్లులు మంజూరు అయ్యేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అప్పు తీసుకొచ్చా..



“ ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేసుకుని చివరి బిల్లు రూ.1లక్ష కోసం రెండు నెలలుగా ఎదురు చూస్తున్నాం. ఇంటి నిర్మాణానికి అప్పులు తీసుకొచ్చినాం. ఎలాగోలా ఇంటి నిర్మాణం పూర్తి అయ్యింది. చివరి బిల్లు ఇప్పటివరకు రాలేదు. చివరి బిల్లు వస్తే కొంత సహకారంగా ఉంటుంది.

\- ప్రియాంక, టేకుమట్ల

స్లాబ్ పోసి నెల దాటింది..



స్లాబ్ పోసిన మరుసటి రోజు అధికారులు ఫొటోలు తీసి ధ్రువీకరించారు. ఇప్పటికి నెలన్నర కావస్తున్న స్లాబ్ బిల్లు రాలేదు. రూ.రెండు లక్షలు మంజూరు అయితే ప్లాస్టరింగ్ కోసం ఉపయోగపడతాయని ఎదురుచూస్తున్నా. బిల్లులను వెంట వెంటనే చెల్లించాలి.

\- కిరణ్ కుమార్, టేకుమట్ల

కెనాల్స్ నిర్మాణంపై అవగాహన


రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్

కాటారం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా పంప్‌హౌస్ నుంచి రిజర్వాయర్లను అనుసంధానించేందుకు ఏర్పాటు చేస్తున్న కెనాల్స్ నిర్మాణంపై మంగళవారం మండలంలోని గుమ్మాళ్లపల్లి, మల్లారం, గూడూర్ గ్రామాల్లో రైతులకు, ప్రజలకు సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ అవగాహన కల్పించారు. సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు రైతులు, ప్రజలకు ఉన్న అనుమానాలు, అభ్యంతరాలపై చర్చించారు. కెనాల్స్ ఎలా, ఎక్కడెక్కడ నిర్మాణం చేయడం, వాటితో కలిగే ప్రయోజనాలను అధికారులు వివరించారు. కాల్వల వెడల్పును బాగా తగ్గించాలని, బహిరంగ మార్కెట్ ధరల ప్రకారం పరిహారం ఇవ్వాలని పలువురు రైతులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎస్సై శ్రీనివాస్, ఆర్‌ఐ వెంకన్న, ఇరిగేషన్ ఏఈలు వెంకన్న, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి


సిబ్బందితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి అర్బన్: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించి కనీస వేతనాలు అమలు చేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది చేపడుతున్న దీక్షలకు మంగళవారం వెంకటరమణారెడ్డి సంఘీబావం తెలిపి మాట్లాడారు. జీఓ నంబర్ 64ను రద్దు చేయాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు.

పుట్ట మధు దిష్టిబొమ్మ దహనం


పుట్ట మధు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కాటారం: దివంగత మాజీ స్పీకర్ శ్రీపాదరావుపై మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పుట్ట మధు దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల, మహిళా మండల అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఆంగోతు సుగుణ మాట్లాడుతూ.. పుట్ట మధు రాజకీయ స్వార్థం కోసం శ్రీపాదరావును పదే పదే అవమానిస్తున్నారని ఆరోపించారు. రాజకీయంగా మంత్రి శ్రీధర్ బాబును ఎదుర్కొనే సత్తాలేక శ్రీపాదరావుపై నిందలు, లేనిపోని వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ జెడ్పీటీసీలు కొండ రాజమ్మ, గుడాల అరుణ, మాజీ ఎంపీపీ రాణిబాయి, ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండ్రు రమేశ్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, స్వప్న, దేవేందర్‌రెడ్డి, రాజు, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి


వివరాలు తెలుసుకుంటున్న యాదగిరి

భూపాలపల్లి రూరల్: హాస్టల్‌లో నుంచి ఎవరి అనుమతి లేకుండా విద్యార్థినులను బయటకు తీసుకువచ్చిన ఉపాధ్యాయులపై, విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన వాచ్‌మెన్‌పై క్రిమినల్‌కేసులు నమోదు చేయాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ అధ్యక్షుడు అద్దునూరి యాదగిరి, కార్యదర్శి సమ్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎస్సీ, బీసీ బాలికల హాస్టల్‌లోను వారు మంగళవారం పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈనెల 12న ఎస్సీ, బీసీ బాలికల హాస్టల్‌లోని తొమ్మిది మంది విద్యార్థినులను, గంగారానికి చెందిన మోడల్ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థినులను మత ప్రచారకులు నియమాలకు విరుద్ధంగా బయటికి తీసుకుపోయినట్లు తెలిపారు. టీచర్లు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఇలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకుమట్ల: ఏవైఎస్ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య, నియోజకవర్గ కన్వీనర్ రాజయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఏవైఎస్ ఆవిర్భావ దినోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ నెల 21 హన్మకొండలో, 26న భూపాలపల్లిలో కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ యువజన సంఘ నాయకులు, పలు సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు


మాట్లాడుతున్న క్రాంతికుమార్

పలిమెల: మండలంలో బతుకమ్మ ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయనున్నట్లు మండల ప్రత్యేకాధికారి క్రాంతికుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో దసరా, బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ.. బతుకమ్మ ఆడే స్థలాల్లో తాగునీరు, శానిటేషన్, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ చల్ల ప్రకాశ్‌రెడ్డి, విద్యుత్ ఏఈ మంగీలాల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అవార్డు అందజేత



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి ఎల్‌బీ నగర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి వాసినేని శ్రీనివాసరావు సేవలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ మదర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో సేవరత్న అవార్డు అందించారు. అనాథ పిల్లలకు ఆర్థిక సాయం చేయడం వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు అవార్డు అందుకున్నాడు. శ్రీనివాస్ ఇప్పటి వరకు 15 సార్లు రక్తదానం చేశారు.

ప్రమాదకరంగా రోడ్డు


కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

చిట్యాల: మండలంలోని కొత్తపేట శివారు నుంచి ఒడితలకు వెళ్లే ప్రధాన రోడ్డుపై మలుపు వద్ద ఇటీవల కురిసిన వర్షానికి సైడ్ మొరం కొట్టుకపోయింది. దీంతో రోడ్డుపై వెళ్లే ప్రయాణికులకు, వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. కావున సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పక్కన మొరం పోయించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

సింగరేణిలో మితిమీరిన రాజకీయం

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో గతం కంటే రాజకీయ జోక్యం పెరిగిందని, దీంతో కార్మిక సమస్యలపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆరోపించారు. ఏరియాలోని కేటీకే 5వ గనిలో మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పిట్ సెక్రటరీ దొర్నాల తిరుపతి అధ్యక్షతన గేట్ మీటింగ్ నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్ట్రక్చర్ మీటింగ్‌లో జరిగిన ఒప్పందాలకు సర్క్యులర్లు విడుదల చేయడంలో యాజమాన్యం జాప్యం చేస్తుందన్నారు. లాభాల వాటా కార్మికులకు 35 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి పైరవీలకు తావు లేకుండా న్యాయం చేయాలని కోరారు. మారు పేర్ల వన్ టైం సెటిల్‌మెంట్ కింద సవరించాలని, సొంత ఇంటి పథకం అతి త్వరలో అమలు చేయాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 19న సింగరేణిలో అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాలకు పిలుపునిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాతంగి రామచందర్, ఆసిఫ్‌పాషా, రవికుమార్, నారాయణమూర్తి, రాజేందర్, కుమారస్వామి, నాగేంద్రబాబు, రాజేందర్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆట స్థలాల పరిశీలన


బతుకమ్మ ఆట స్థలం పరిశీలిస్తున్న కమిషనర్

భూపాలపల్లి అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాలు, కాలనీల్లో మంగళవారం అధికారులు బతుకమ్మ ఆట స్థలాలను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, అధికారులు, సిబ్బందితో కలిసి పుల్లూరి రామయ్యపల్లి, మహబూబ్‌పల్లి, భాస్కర్‌గడ్డ, వేశాలపల్లి గ్రామాల్లో బతుకమ్మ ఆట స్థలాలను పరిశీలించారు. బతుకమ్మ, దసరా వేడుకలకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని, స్థలాలను చదును చేసి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, చెరువుల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ మానస, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవీన్, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి


మల్హర్: వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు


రేగొండలో..

మల్హర్: బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో గ్రామాల్లో వీధి దీపాలు లైట్లు బిగించడానికి నిధులు సమకూర్చాలని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులు మంగళవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీరామ్మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా అభివృద్ధి పనులు చేయడానికి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ సీఎస్ఆర్ నిధుల ద్వారా ప్రస్తుత పండుగ అవసరాలకు సంబంధించి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు ఎల్ఈడీ లైట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను కోరారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్‌రెడ్డి, చెలకల రాజు, ప్రవీణ్‌రాజ్, శివప్రసాద్, రజిత, సతీష్, భాస్కర్ రెడ్డి, రాజు, స్వామి పాల్గొన్నారు.

కాటారం: బతుకమ్మ, దసరా సంబరాలకు నిధులు ఇవ్వాలని కోరుతూ మండలంలోని పంచాయితీ కార్యదర్శులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బాబుకు వినతిపత్రం సమర్పించారు. గ్రామపంచాయతీల్లో నిధుల కొరత ఉన్నందున సంబరాల ఏర్పాట్లకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, నాగరాజు, కరుణాకర్, శివ, తదితరులు పాల్గొన్నారు.

రేగొండ: సద్దుల బతుకమ్మ, దసరా పండగల నిర్వహణకు నిధులు మంజూరు చేయ్యాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు మంగళవారం ఎంపీడీఓ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కుమార్, జీవిత, పద్మ, మౌనిక, అమూల్య, మమత, జ్యోతి, శంకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

తీజ్ ఉత్సవాలు ప్రారంభం


కాటారం: సీత్లా భవాని వేడుకలు నిర్వహిస్తున్న మహిళలు


భూపాలపల్లి అర్బన్: పూజలు నిర్వహిస్తున్న కులపెద్దలు, మహిళలు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని బానోత్ వీధిలో హాథీరాం సేవాన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తీజ్ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ మేరకు కాలనీవాసులు సీత్లా భవానీ మాతకు ఘనంగా పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించి ఆట పాటలలతో డప్పు చప్పులతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కులపెద్దలు బానోత్ సోమ్లానాయక్, రాజునాయక్, సమ్మయ్య, సేవానాయక్, రాజునాయక్, రాజేందర్, కరణ్‌సింగ్, బాపురావు, జుమ్మునాయక్ పాల్గొన్నారు.

గంగారంలో..

కాటారం: మండలంలోని గంగారంలో లంబాడీలు తీజ్ ఉత్సవ ప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తీజ్‌లో భాగంగా లంబాడీ పెద్దలు, మహిళలు, యువత అధిక సంఖ్యలో తరలివెళ్లి గ్రామ శివారులో శీతల భవాని పండుగ జరుపుకున్నారు. అమ్మ వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో తండానాయకులు రాజు, భూక్య రాజ్‌కుమార్, లావిడియా రమేశ్‌నాయక్, బాలాజీ, సమ్మయ్య, రఘు, స్వామినాయక్, రెడ్డినాయక్, లక్ష్మణ్, సారయ్య, పిల్లలు, మహిళలు, పెద్దలు, యువత పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

కాటారం: ప్రధాన మంత్రి నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా ఈ నెల 18న మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్‌కుమార్ తెలిపారు. ఈ శిబిరంలో పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, చంద్రుపట్ల సునీల్‌రెడ్డి పాల్గొంటారని కాటారం సబ్ డివిజన్ పరిధిలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రంజిత్‌కుమార్ పిలుపునిచ్చారు.